క్లుప్తంగా

కోడి పందేల నిర్వాహకుల బైండోవర్



తెనాలి రూరల్: సంక్రాంతి పండుగ సందర్భంగా కోడి పందేలు జరగకుండా చర్యలు తీసుకోవాలని పోలీసులు, పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలకు తహసీల్దార్ కేవీ గోపాలకృష్ణ శనివారం ఉత్తర్వులు జారీ చేసిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో త్రీ టౌన్, రూరల్ పోలీసులు పలువురు కోడి పందేల నిర్వాహకులు, పందెం కోళ్ల పెంపకందార్లను తహసీల్దార్ ఎదుట ఆదివారం హాజరుపరచి బైండోవర్ చేశారు. పందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

మహిళా కార్మికులకు చీరల పంపిణీ



తెనాలి రూరల్: లయన్స్ క్లబ్ ఆఫ్ తెనాలి స్నేహ ఆధ్వర్యంలో స్థానిక సత్యనారాయణ టాకీస్ రోడ్‌లోని మున్ని మస్తాన్ పాఠశాలలో పారిశుద్ధ్య కార్మికులకు చీరలు పంపిణీ చేశారు. మార భ్రమరాంబ ఎనిమిదో వర్ధంతి సందర్భంగా వారి కుటుంబ సభ్యులు వీటిని అందజేసినట్లు క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షులు కాకరపర్తి సుబ్రహ్మణ్యం తెలిపారు. కార్యక్రమంలో నేరెళ్ల కష్ణమోహన్రావు, సాతులూరి రామప్రసాద్, కిక్కూరి చిన్న కృష్ణారెడ్డి, బి.సంధ్యారాణి, ఎం.రాజారమణి, పి.మాధవి, ఎం.శివలక్ష్మి, జి.రమణ, పిల్లి రాణి తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న ముగ్గుల పోటీలు



తాడేపల్లిరూరల్ : సంక్రాంతి పండగ సందర్భంగా తాడేపల్లి పట్టణం మహానాడు 1వ రోడ్డులో జనసేన పట్టణ అధ్యక్షుడు అంబటి తిరుపతిరావు ఆదివారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఏపీఎంఎస్ అండ్ ఐడీసీ చైర్మన్ చిల్లపల్లి శ్రీనివాసరావు పాల్గొని పోటీలను ప్రారంభించారు. పోటీల్లో గెలుపొందిన మహిళలకు బహుమతులు ప్రదానం చేశారు. జనసేన జిల్లా సంయుక్త కార్యదర్శి బడే కోమలి, రాష్ట్ర ఐటీ విభాగం కో–ఆర్డినేటర్ చవ్వాకుల కోటేష్‌బాబు, ఎంటీఎంసీ అధ్యక్షుడు మునగపాటి వెంకట మారుతీరావు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరం

గుంటూరు మెడికల్: సయ్యద్ హాజి ఆదాం సాహెబ్ ఆధ్వర్యంలో స్థానిక కోబాల్ట్ పేట నాలుగో లైన్ మసీదు ఆవరణలో వాసన్ కంటి ఆస్పత్రి, వారాహి డెంటల్ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం ఆదివారం నిర్వహించారు. వారాహి డెంటల్‌కు చెందిన డాక్టర్ వెంకటేష్ వైద్య సలహాలు అందజేశారు. వైద్యశిబిరంలో 148 మందికి పరీక్షలు నిర్వహించి, 34 మందికి శుక్లాలు , పొరలు గుర్తించి ఎన్టీఆర్ వైద్య సేవలో వాసన్ ఐ కేర్ హాస్పిటల్‌లో ఉచితంగా ఆపరేషన్‌లు చేయిస్తామని పీఆర్‌ఓ వెంకట్రావు తెలిపారు.

దళితుల జీవన స్థితిగతులపై సర్వే

తాడేపల్లిరూరల్ : దుగ్గిరాల మండల పరిధిలోని మంచికలపూడి గ్రామంలో ఆదివారం దళితుల జీవన స్థితిగతులు, ఆర్థిక పరిస్థితులపై వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షులు జెట్టి బాలరాజు మాట్లాడుతూ గ్రామంలో ఉపాధి హామీ పనులు వారం రోజుల కంటే ఎక్కువగా జరగడం లేదని అన్నారు. వేతనాలు నెలలు గడుస్తున్నా చెల్లించడం లేదని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ పథకాలు అమలు చేయడం లేదని దీని వల్ల పిల్లల స్కూలు ఫీజులు చెల్లించకపోవడంతో పాఠశాల యాజమాన్యాలు విద్యార్థులను బయట నిలబెడుతున్నారని తెలిపారు. సంఘం సభ్యులు స్టాలిన్, బ్రహ్మేశ్వరరావు, ప్రకాష్‌రావు, సునీల్, ఎలమందయ్య, వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

ఇనుప వ్యర్థాలతో ఎన్టీఆర్ విగ్రహం

తెనాలి: పట్టణానికి చెందిన ప్రముఖ శిల్పకారులైన కాటూరి వెంకటేశ్వరరావు, కుమారులు రవిచంద్ర, శ్రీహర్షలు ఇనుప వ్యర్థాలతో రూపొందించిన నందమూరి తారక రామారావు విగ్రహాన్ని మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ ఆవిష్కరించారు. రూరల్ మండల గ్రామం కంచర్లపాలెంలోని కాటూరి ఆర్ట్ గ్యాలరీలో విగ్రహావిష్కరణ అనంతరం అక్కడి జాతీయ నాయకుల విగ్రహాలను, బాబాసాహెబ్ అంబేడ్కర్ విగ్రహాల ప్రదర్శనను తిలకించారు.

ఆలోచింపజేసే 'మట్టి మనిషి'

- వాసిరెడ్డి సీతాదేవి 'మట్టిమనిషి' నాటకం
- నేడు తెనాలిలో ప్రదర్శన
- నాటక రచయిత వల్లూరు శివప్రసాద్‌చే నాటకీకరణ.. ఎస్‌ఎం బాషా దర్శకత్వం



మట్టిమనిషి నవల



డాక్టర్ వాసిరెడ్డి సీతాదేవి



వల్లూరు శివప్రసాద్



ఎంఎం బాషా

తెనాలి: తెనాలి ప్రాంతానికి చెందిన సుప్రసిద్ధ రచయిత డాక్టర్ వాసిరెడ్డి సీతాదేవి నవల 'మట్టిమనిషి' రంగస్థల నాటకంగా పట్టణ ప్రేక్షకుల ముందుకు వస్తోంది. హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ నాటక సంస్థ మిత్ర క్రియేషన్స్‌చే సోమవారం సాయంత్రం ఆరు గంటలకు స్థానిక తెనాలి రామకృష్ణకవి కళాక్షేత్రంలో ప్రదర్శిస్తారు. అభ్యుదయ రచయితల సంఘం 'కళాతోరణం'లో భాగంగా ఈ నాటక ప్రదర్శనను ఏర్పాటుచేశారు. నాటకానికి ముందుగా జరిగే ప్రారంభసభలో అరసం జాతీయ అధ్యక్షుడు, కేంద్ర సాహిత్య అవార్డుకు ఎంపికైన పెనుగొండ లక్ష్మీనారాయణను సత్కరిస్తారు.

14 భారతీయ భాషల్లోకి అనువాదం..

వాసిరెడ్డి సీతాదేవి రచించిన మట్టిమనిషి నవల 1970లో ఓ దినపత్రిక ఆదివారం అనుబంధంలో సీరియల్‌గా ప్రచురితమైంది. 1972లో పుస్తకంగా ప్రచురితమైంది. 1995–2000లో ఉస్మానియా యూనివర్శిటీ ఎంఏ ఫైనల్ విద్యార్థులకు పాఠ్యాంశంగా ఎంపిక చేసింది. నేషనల్ బుక్‌ట్రస్ట్ ఆఫ్ ఇండియా వారు ఈ పుస్తకాన్ని 14 భారతీయ భాషల్లోకి అనువదించి ప్రచురింపజేశారు. మాస్టర్ పీసెస్ ఆఫ్ ఇండియన్ లిటరేచర్ అనే కాలంలో ప్రస్తావించిన – నన్నయ నుంచి నేటివరకు వెయ్యేళ్ల తెలుగు సాహిత్యంలో వచ్చిన గొప్ప రచనల్లో మట్టిమనిషి నవలను 13వ రచనగా గుర్తింపు పొందటం విశేషం.

నాటక ఇతివృత్తం..

మట్టికీ మనిషికీ సామాజికంగా వుండే సంబంధాలు, వాటి మంచిచెడ్డలు, ఆ సంబంధాల్లోని మార్పులను వాస్తవంగా చిత్రించిన 'మట్టిమనిషి' నవలకు దృశ్యరూపమే ఈ నాటకం. భూమిని నమ్ముకోక, అమ్ముకునే జీవితాల్లోని దుష్పలితాలను ఈ నాటకం కళ్లకు కడుతుంది. బతుకుదెరువు కోసం పొరుగూరికి వచ్చిన వెంకయ్య అనే యువకుడు, జీతగానిగా రాణింపులేదని గ్రహించి, కొలువు మానేసి పొలం కౌలుకు చేస్తూ రెక్కల కష్టంతో రైతుగా మారతాడు. భూమి ఇల్లూ సంపాదిస్తాడు. అతడి బాటలో కొడుకు సాంబయ్య మరింత ఆస్తిని సంపాదిస్తాడు. సాంబయ్య కోడలుగా వచ్చిన వరూధినికి నగరజీవితంపై గల వ్యామోహం, సినిమా హాలు వ్యాపారంపై మోజుతో కొంప ముంచుతుంది. మోసపోయి ఆస్తిని పోగొట్టుకుంటారు. కోర్టులోనూ ఓడిపోతారు. ఇలాంటప్పుడు మట్టిని నమ్ముకున్న రైతు కుటుంబం ఏం చేసిందనేది నాటకం.

మూడు గంటల ప్రదర్శన..

సీతాదేవి మట్టిమనిషి నవలను తెనాలి నాటక రచయిత వల్లూరు శివప్రసాద్ నాటకీకరించారు. నవల ప్రాధాన్యతకు, పాత్రల ఔచిత్యానికి ఎలాంటి ఇబ్బంది లేకుండా మూడు గంటల ప్రదర్శన వచ్చేలా రచన చేశారు. హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ నటుడు, దర్శకుడు ఎస్‌ఎం బాషా దర్శకత్వంలో ఈ నాటకాన్ని ప్రదర్శనకు సిద్ధంచేశారు. మొత్తం 50 మంది నటీనటులు, సాంకేతిక నిపుణులతో మూడు గంటల నిడివితో ఈ ప్రదర్శన కొనసాగనుంది. కొన్నేళ్ల క్రితం తెనాలిలో 'పడమటి గాలి' నాటకాన్ని టికెట్‌పై ప్రదర్శించారు. మళ్లీ ఇంతకాలానికి మరో సాంఘిక నాటకాన్ని టికెట్‌పై ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నారు. ప్రేక్షకుల ఆదరణ ఎలా ఉంటుందో వేచిచూడాల్సివుంది.

గుంతల రోడ్లతో చింతలు

- అధ్వానంగా తెనాలి– హనుమాన్‌పాలెం రహదారి
- ఇబ్బందులు పడుతున్న వాహనదారులు



చివలూరు గ్రామం నుంచి దావులూరు అడ్డరోడ్డు వరకు పూర్తిగా దెబ్బతిన్న రహదారి

కొల్లిపర: మండలంలోని ప్రధాన రహదారులు అధ్వానంగా మారి ప్రయాణికులు ఇబ్బందులకు గురవుతున్నారు. ముఖ్యంగా కొల్లిపర నుంచి, హనుమాన్‌పాలెం నుంచి తెనాలికి వెళ్లే ఆర్‌అండ్‌బీ ప్రధాన రహదారిలో దావులూరు అడ్డరోడ్డు నుంచి చివలూరు గ్రామం శివారు వరకు, జెముడుబాడు నుంచి చక్రాయపాలెం మీదుగా వెళ్లే ప్రధాన రహదారిపై నిత్యం ఇసుక లారీలు ప్రయాణించటం వలన ఏర్పడిన పెద్ద పెద్ద గుంతలు ఏర్పడి ప్రయాణికులు నిత్యం నరకయాతన పడుతున్నారు. కొన్ని చోట్ల పెద్ద ఎత్తున గుంతలు ఏర్పడి ద్విచక్ర వాహనాలు, ఆటోలు ప్రమాదాలకు గురవుతున్నాయి. రాత్రిళ్లు రహదారి వెంట సరైన వీధి లైట్లు లేకపోవటంతో రోడ్డుపై ఏర్పడిన గుంతలు గుర్తించలేక ద్విచక్ర వాహనదారులు అధికంగా ప్రమాదాలకు గురవుతున్నారు. గుంతలు పూడ్చాలని పలుమార్లు సంబంధిత అధికారులకు, నాయకులకు విన్నవించినా పట్టించుకోలేదని, స్థానిక ఎమ్మెల్యే, మంత్రి నాదెండ్ల మనోహర్ గ్రామంలో వచ్చినప్పుడు మొరపెట్టుకున్నా పట్టించుకోలేదని ఆయా గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇటీవల నందివెలుగు నుంచి అత్తోట గ్రామం వరకు మాత్రమే అధికారులు గుంతలు పూడ్చారు. ఒక గ్రామం వరకు మాత్రమే గుంతలు పూడ్చడం పై మిగిలిన గ్రామాలవాసులు పలుఅనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైన మంత్రి చొరవ తీసుకుని రోడ్లపై గుంతలు పూడ్చించి, రోడ్డు వెంట ఉన్న ఇసుక మేతలను తొలగింపజేసి సమస్యలను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

సీసీ రోడ్డు ప్రారంభం



శిలాఫలకాన్ని ఆవిష్కరించిన మంత్రి మనోహర్

తెనాలి రూరల్: పట్టణ 23వ వార్డు పరిధిలోని ఆర్‌ఆర్ నగర్ 2వ లైన్ వద్ద నూతనంగా నిర్మించిన సీసీ రోడ్డు ప్రారంభోత్సవం ఆదివారం సాయంత్రం జరిగింది. పురపాలక సంఘం ద్వారా నిర్మించిన రోడ్డు ప్రారంభోత్సవంలో పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ పాల్గొని, శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. స్థానిక మహిళలతో రిబ్బన్ కట్ చేయించి రోడ్డు ప్రారంభింపజేశారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు ఆయన్ను ఘనంగా సత్కరించారు. ఆయన మాట్లాడుతూ.. గతంలో తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో ఈ సమస్యపై సరైన అవగాహన లేక పరిష్కరించలేకపోయానని అన్నారు. ఇక్కడ ప్రజలు ఎదురు చూస్తున్న రోడ్డును ఎట్టకేలకు ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ అత్తోట నాగవేణి, 23వ వార్డు కౌన్సిలర్ తోక శిరీష, మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న, తహసీల్దార్ కేవీ గోపాలకృష్ణ, నాయకులు పాల్గొన్నారు.

బంగారు ఉంగరాలతో ఉడాయింపు

తెనాలి రూరల్: కొనుగోలుదారుడిలా వచ్చి నగల దుకాణంలో బంగారు ఉంగరాలతో ఓ గుర్తు తెలియని వ్యక్తి ఉడాయించాడు. పట్టణ గంగానమ్మపేటలోని మార్వాడీ గుడి సమీపంలోని ఓ నగల దుకాణానికి కొనుగోలుదారుడిలా ఓ గుర్తు తెలియని వ్యక్తి ఆదివారం వచ్చాడు. ఉంగరాలు చూపించాలని దుకాణంలోని వారిని అడిగాడు. వారు చూపించారు. మూడు ఉంగరాలను చేతికి పెట్టుకుని చూసిన ఆ వ్యక్తి ఫోన్ మాట్లాడుతున్నట్టు నటించి దుకాణం నుంచి పరారయ్యాడు. దుకాణ నిర్వాహకుల ఫిర్యాదు మేరకు టూ టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బంగారు గొలుసు దోపిడీ

తెనాలి రూరల్: రోడ్డుపై నడుస్తున్న మహిళ మెడలోని బంగారు గొలుసును గుర్తు తెలియని వ్యక్తులు దోచుకెళ్లారు. మండలంలోని అంగలకుదురుకు చెందిన సత్యవతి (54) సాయిబాబా గుడి సమీపంలోని అపార్ట్‌మెంట్‌లో నివసిస్తారు. ఆదివారం సాయంత్రం వాకింగ్‌కు రోడ్డుమీదకు వచ్చారు. ఇంతలో బైక్‌పై వచ్చిన ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు ఆమె మెడలోని బంగారు గొలుసు లాక్కెళ్లారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు రూరల్ ఎస్‌ఐ సీహెచ్ ప్రతాప్‌కుమార్ తెలిపారు.

శ్రమ సంస్కృతి పరిరక్షణ అవసరం



విజేతలకు బహుమతుల ప్రదానం

తెనాలి: భారతీయ సంప్రదాయాలను, శ్రమ సంస్కృతిని కాపాడుకోవాలని ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం రాష్ట్ర కమిటీ సభ్యురాలు వల్లూరి భారతి సూచించారు. రైతుసంఘం ఆధ్వర్యంలో రూరల్ మండల గ్రామం కంచర్లపాలెంలో ఆదివారం మహిళలకు రంగవల్లులు, మ్యూజికల్ చైర్స్ పోటీలను నిర్వహించారు. విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. ప్రజానాట్యమండలి రాష్ట్రనాయకుడు టి.రాఘవయ్య మాట్లాడుతూ మానవ శ్రమలోనే కళలు ఉద్భవించాయని సోదాహరణంగా చెప్పారు. శ్రమకు, కళలకు గుర్తింపు తగ్గిపోతోందని ఆవేదన వ్యక్తంచేశారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి కొల్లిపర బాబూప్రసాద్ తన ప్రసంగంలో ప్రపంచీకరణ ఫలితంగా మానవ సంబంధాలు అంతరించిపోతున్నాయని అభిప్రాయపడ్డారు. ఉమ్మడి సంస్కృతి, ఉమ్మడి ఆలోచనలు మృగ్యమైపోతున్న నేటి రోజుల్లో వ్యవసాయ సంస్కృతికి కాపాడుకునేందుకు కార్మిక, కర్షక ఐక్యత అవసరం ఉందన్నారు. అధ్యక్షత వహించిన జిల్లా ఉపాధ్యక్షుడు ములకా శివసాంబిరెడ్డి మాట్లాడుతూ యువత చెడు అలవాట్లకేసి చూడకుండా ఉండేందుకు ఆటపాటలు అవసరమన్నారు. షేక్ హుస్సేన్‌వలి, చుక్కపల్లి భరత్, గాలి శారదాదేవి, జి.భరత్, ములకా శివకుమారి పాల్గొన్నారు.

దేవికారాణి కవితా సేద్యం అభినందనీయం

స్వప్న వేణువు కవితా సంపుటి ఆవిష్కరణలో డాక్టర్ కృపాచారి



స్వప్న వేణువు పుస్తకావిష్కరణ

తెనాలి: ఉపాధ్యాయినిగా వృత్తిజీవితాన్ని గడుపుతూనే నిత్యం కవితా సేద్యం చేస్తున్న కవయిత్రి దేవికారాణి కృషి అభినందనీయమని దళిత సార్వత్రిక విశ్వవిద్యాలయం ఉపకులపతి డాక్టర్ గుజ్జర్లమూడి కృపాచారి అన్నారు. పట్టణానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయిని, కవయిత్రి కొలకలూరి దేవికారాణి రాసిన కవితల సంపుటి 'స్వప్న వేణువు' పుస్తకావిష్కరణ సభ శనివారం రాత్రి స్థానిక కవిరాజ పార్కులోని వీజీకే భవన్‌లో జరిగింది. డాక్టర్ అయినాల మల్లేశ్వరరావు అధ్యక్షత వహించారు. ప్రముఖ రచయిత, దర్శకుడు జె.బాలవర్ధిరాజు పుస్తకాన్ని ఆవిష్కరించారు. సరళ సుందర శైలితో రాసిన దేవికారాణి తన కవితల్లో చెప్పదలచిన అంశాన్ని సూటిగా చెప్పటం గొప్ప విషయమన్నారు. ప్రకృతిలోని ప్రతి అంశాన్ని కవితా వస్తువుగా స్వీకరించిన కవయిత్రి సృజన గొప్పదని తొలి ప్రతిని స్వీకరించిన ప్రముఖ రచయిత శిఖా ఆకాష్ అన్నారు. స్వప్న వేణువు పుస్తకంలోని కవితలపై కవయిత్రి షేక్ అస్మతున్నీసా, రచయిత్రి పింగళి భాగ్యలక్ష్మి ప్రసంగించారు. విద్యాధర ప్రభాస నిర్వహించిన సభలో ఈఎల్‌వీ అప్పారావు, అత్తోట యశ్వంత్‌బాబు మాట్లాడారు. కవయిత్రి దేవికారాణి తన కవితా రచనకు ప్రేరణ, చేసిన కృషిని సభాముఖంగా వివరించారు.

బాధితులకు అండగా నిలుస్తా

వైఎస్సార్ సీపీ తాడికొండ సమన్వయకర్త వనమా బాల వజ్రబాబు



మాట్లాడుతున్న వనమా బాల వజ్రబాబు

ఫిరంగిపురం: పొనుగుపాడు గ్రామం ఎస్సీ కాలనీ వద్ద చర్చి సమీపంలోని గోడను అక్రమంగా టీడీపీ నాయకులు కూల్చడం అన్యాయమని తాడికొండ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త వనమా బాల వజ్రబాబు అన్నారు. బాధితులకు అండగా పార్టీ ఉంటామని స్పష్టం చేశారు. బాధితులను పరామర్శించేందుకు బయలుదేరిన ఆయన్ని సొలస బస్టాండు సెంటర్‌లో సీఐ రవీంద్రబాబు అడ్డుకున్నారు. శాంతిభద్రతల దృష్ట్యా అక్కడికి వెళ్లొద్దని చెప్పారు. బాల వజ్రబాబు విలేకరులతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత నాయకులు అధికారాన్ని అడ్డుపెట్టుకొని చర్చి వద్దనున్న గోడను కూల్చివేశారన్నారు. మత సంబంధం వంటి విషయాల్లో ప్రభుత్వం జోక్యం చేసుకోవడం సరికాదన్నారు. ప్రజల వద్దకు వెళ్లేందుకు ప్రయత్నిస్తుంటే పోలీసులు అడ్డుకోవడం ఏమిటని ప్రశ్నించారు. 16న పొనుగుపాడు గ్రామానికి వెళ్లి బాధితులను పరామర్శిస్తానన్నారు. అనంతరం సీఐ రవీంద్రబాబుతో మాట్లాడారు. గ్రామంలో శాంతిభద్రతలకు ఆటంకం లేకుండా చూడాలని కోరారు. జెడ్పీటీసీ సభ్యురాలు దాసరి కత్తిరేణమ్మ, పార్టీ మండలాధ్యక్షుడు మార్పుల శివరామిరెడ్డి, కొమ్మారెడ్డి చిన్నప్పరెడ్డి, చిట్టా అంజిరెడ్డి, పాలపాటి రఘు, బద్దూరి శ్రీనివాసరెడ్డి, గేరా కోటేశ్వరరావు, సేవా నాగరాజు, పి.చిన్న, డి. మెల్కియా, టి.కృష్ణ, చేవూరి రామమోహన్‌రెడ్డి, పి.జోసఫ్‌కుమార్, అబ్దుల్లా, బి.అంజిరెడ్డి పాల్గొన్నారు.

ఆకట్టుకుంటున్న పతంగులు



గాలిపటాలు కొనుగోలు చేస్తున్న చిన్నారులు



సీతాకోక చిలుక పతంగి

మంగళగిరి (తాడేపల్లిరూరల్): పిల్లల్లో సంక్రాంతి పండగ ఉత్సాహం కనిపిస్తోంది. పండగ సెలవుల్లో దారం తెగిన గాలి పటాల్లా వారిని ఆనందాన్ని ఎవరూ పట్టలేకున్నారు. ముఖ్యంగా కనుమ రోజు పతంగులు ఎగుర వేసేందుకు దుకాణాల చుట్టూ తిరుగుతున్నారు. వీరి కోసం వ్యాపారులు మార్కెట్‌లో 50 రకాల ఆకర్షణీయమైన రంగులు, బొమ్మలతో గాలిపటాలను అందుబాటులో ఉంచారు. రూ.10 నుంచి రూ.100లకు సైజు, డిజైన్ బట్టి విక్రయిస్తున్నారు. మంగళగిరి మెయిన్ బజార్‌లోని ఫ్యాన్సీ స్టోర్లలో పతంగులను విక్రయిస్తున్నారు. వీటిలో బాహుబలి గాలిపటాలు మూడేళ్లుగా కొనసాగుతున్నాయి. ఈ ఏడాది ప్రత్యేకంగా శ్రీరాముడు, అయోధ్య బాలరాముడు, స్పైడర్ మ్యాన్, డోరొమెన్, పక్షులు, జూనియర్ ఎన్టీఆర్, కల్కి సినిమా బొమ్మలతో గాలిపటాలు లభిస్తున్నాయి. గాలిపటాలను ఎగుర వేసేందుకు రెండు మూడు రకాల దారం ఉండలు అందుబాటులో ఉంచారు.

నేటి నుంచి శాంతి సువార్త పండుగలు



మంగళగిరి (తాడేపల్లిరూరల్): ప్రపంచ శాంతిని కోరుతూ జీసెస్ గాస్పెల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం నుంచి శాంతి సువార్త పండగలు జరుగుతాయని అసోసియేషన్ అధ్యక్షుడు రెవ బిషప్ ఆర్.మోషేబాబు తెలిపారు. మంగళగిరి నగర పరిధిలోని తెనాలి బైపాస్ ఫ్లై ఓవర్ వద్ద ఉన్న ప్రాంగణంలో ఆదివారం మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. మోషేబాబు మాట్లాడుతూ 17వ తేదీ వరకు పండుగలు మంగళగిరి – తెనాలి ఫ్లై ఓవర్ పక్కనే ఉన్న అందే చంటి ప్లాట్స్ ప్రాంగణంలో జరుగుతాయని తెలిపారు. మంగళగిరి జేజేఏ డైరెక్టర్ రెవ.డాక్టర్ ఎస్.వసంతరావు మాట్లాడుతూ వివిధ ప్రాంతాల నుంచి సుమారు 10 వేల మందికి పైగా విశ్వాసులు పాల్గొంటారని చెప్పారు. హాజరయ్యే వారికి వసతి, భోజనం, వాహన సదుపాయాలను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. కులమతాలతో సంబంధం లేకుండా అందరూ ఆహ్వానితులే అని పేర్కొన్నారు. సువార్త పండుగ కరపత్రాలను ఆవిష్కరించారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



1983-84 బ్యాచ్ టెన్త్ విద్యార్థులు

మంగళగిరి (తాడేపల్లిరూరల్): పూర్వ విద్యార్థులు 30 ఏళ్ల తర్వాత ఆత్మీయ సమ్మేళనంతో మళ్లీ ఒక్కటయ్యారు. మంగళగిరి మండల పరిధిలోని రేవేంద్రపాడు జెడ్పీ ఉన్నత పాఠశాలలో 1983–84లో 10వ తరగతి చదువుకున్న విద్యార్థుల సమ్మేళనం పెదవడ్లపూడి డీబీఎన్ గార్డెన్‌లో ఆదివారం జరిగింది. 100 మంది పూర్వ విద్యార్థులు హాజరయ్యారు. గతించిన స్నేహితుల కోసం రెండు నిమిషాలు మౌనం పాటించారు. అనంతరం వివిధ ఆటల పోటీలు నిర్వహించి, గెలుపొందిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. ఏకపాత్రాభినయం, సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. పూర్వ విద్యార్థులు భావన శ్రీనివాసరావు, లోకం దుర్గారావు, ముత్తవరపు హైమావతి, మన్నవ అప్పారావు, గిరిజ, ప్రియతం, ఉల్లంగి శ్రీనివాసరావు, కుంచకర్ల దుర్గారావు, బి.స్టాలిన్, రాజారావు, అవల్దార్ పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాలివ్వాలి

తాడేపల్లిరూరల్: తాడేపల్లి పట్టణ పరిధిలోని ముగ్గు రోడ్డు ప్రాంతంలో కొండ పోరంబోకు స్థలాల్లో నివాసముంటున్న పేదలకు ఇళ్ల పట్టాలు మంజూరు చేయాలని, ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఈమని అప్పారావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం ముగ్గు రోడ్డులోని దళితవాడలో నాయకులతో కలసి ఇంటింటా సర్వే చేశారు. స్థానిక సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం తాడేపల్లి పట్టణ కార్యదర్శి నీరుడు దుర్గారావు, నాయకులు దర్శనపు విజయ్‌బాబు, మన్నం లీలమ్మ, గద్దల గోపమ్మ పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాల ఉచ్చులో పడవద్దు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న పారేపల్లి మహేష్

మంగళగిరి (తాడేపల్లిరూరల్): యువత మాదక ద్రవ్యాల ఉచ్చులో పడి జీవితాలను నాశనం చేసుకోవద్దని బీసీ సంక్షేమ, స్వర్ణకార సంఘాల జిల్లా అధ్యక్షుడు పారేపల్లి మహేష్ అన్నారు. గుంటూరు డీఎస్‌ఆర్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్, డీఎస్‌ఆర్ డీ ఎడిక్షన్ అండ్ కౌన్సెలింగ్ సెంటర్ ఆధ్వర్యంలో మంగళగిరి పట్టణ పరిధిలోని టిడ్కో గృహాల వద్ద ఆదివారం యువతకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మహేష్ మాట్లాడుతూ చెడు స్నేహాల వల్ల లేదా పరిస్థితుల ప్రభావంతో తాత్కాలిక ఆనందం కోసం మాదక ద్రవ్యాలకు అలవాటు పడితే అనేక రుగ్మతల బారిన పడతారని అన్నారు. మాదక ద్రవ్యాలు సేవించడం వల్ల కలిగే దుష్పరిణామాలను వివరించారు. ముగ్గుల పోటీలలో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ గిరిజ, ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు సుష్మ, బీసీ సంక్షేమ సంఘం పట్టణ అధ్యక్షులు నరసింహారావు,, విజయ హెల్త్ కేర్ ట్రస్ట్ అధ్యక్షురాలు కాగితాల స్వాతి, స్థానికులు రాజ్యలక్ష్మి, సుబ్బారావు పాల్గొన్నారు.

అర్ధాకలితో కార్మిక కుటుంబాలు



తాడేపల్లిరూరల్: బ్రహ్మానందపురం ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు, వారి కుటుంబాలు అర్ధాకలితో అలమటిస్తున్నాయని సీఐటీయూ తాడేపల్లి పట్టణ కార్యదర్శి వేముల దుర్గారావు అన్నారు. ఆదివారం కార్మికుల దీక్షను ఏసీసీ కార్మికుల పోరాట కన్వీనర్ కూరపాటి స్టీవెన్‌తో కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా దుర్గారావు మాట్లాడుతూ మూడు దశాబ్దాలకుపైగా అక్రమ లాకౌట్ కారణంగా చిన్నాభిన్నమైన కార్మికుల సమస్యలను పరిష్కారిస్తానని ఎన్నికల్లో మంత్రి నారా లోకేష్ హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం సమస్యలను పరిష్కరించి, న్యాయం చేయాలని కోరారు. ఈ దీక్షలలో డి.నాగేశ్వరరావు, ఎం.సాంబశివరావు, ఎస్కే ఆరిఫ్, సీహెచ్ పిచ్చయ్య, బి.సూర్యప్రకాష్ దీక్షలో కూర్చున్నారు. ఏఐఎఫ్‌టీయూ నాయకులు కె. ఆదినారాయణ, అంకయ్య, నవనీతం పాల్గొన్నారు.